


# విభారె తెలుగు దినపత్రిక
# VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 07-12-2023 సంపుటి : 06 సంచిక : 88 పేజీలు : 8 వెల : రూ 3-00

# తుఫాన్‌కు నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దు : సిఎం జగన్

## చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 30 లక్షలు అందిస్తాం
## కలెక్టర్లు, ఎస్పీలతో సిఎం వీడియో కాన్ఫరెన్స్



అమరావతి,డిసెంబర్6( విభారె) : మించౌగ్ తుఫాన్‌ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో తుఫాన్ ప్రభావం, చేపడుతున్న సహాయచర్యలపై అధికారులు సీఎం జగన్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ..."వర్షాలు కొంత తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం తుఫాన్ బలహీనపడి అల్పపీడనంగా మారింది. తుఫాన్ వల్ల వర్షాలు విస్తృతంగా పడ్డాయి. కలెక్టర్లు, సీనియర్ ఐఏఎస్ అధికారులు స్పెషల్ ఆఫీసర్లుగా క్షేత్రస్థాయిలో చాలా బాగా పనిచేశారు. బాధితులకు సకాలంలోసాయం అందించాలి.పదిరూపాయలు ఎక్కవ ఖర్చు అయినా బాధితులకు మంచి సహాయం అందాలి. బాధితులకు చేసే సాయంలో లోటు రాకూడదు. వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిన్న వారికి రూ.10వేలు ఇవ్వాలి. క్యాంపుల నుంచి తిరిగి ఇళ్లకు వెళ్తున్న సందర్భంలోనూ వారికి అవసరం అయిన సాయం చేయాలి. పొలాల్లో నీటిని త్వరితగతిన తొలగించాలి. పంటపొలాల్లో ఉన్న వరదనీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టి పెట్టాలి" అని సీఎం జగన్ తెలిపారు."పంటల రక్షణ, పంటలకు పరిహారం అందించడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్ని రకాలుగా రైతులకు అండగా ఉండాలి. 80 శాతం సబ్సిడీపై విత్తనాల సరఫరాకూ అన్ని రకాలుగా సిద్ధం కావాలి. యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టండి. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించాలి. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో రవాణా పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి. వర్షాలు తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై దృష్టిసారించండి. అధికారులంతా బాగానే పనిచేస్తున్నారు. మేమందరం మీకు తోడుగా ఉన్నాం. ఒక్క ఫోన్ కాల్ దూరంలో ఉన్నాం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొండి. దురదృష్టవశాత్తూ విధి నిర్వహణలో ఉండగా చెట్టుకూలి కానిస్టేబుల్ చనిపోయాడు. ఆ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఆదుకుంటుంది. ఆ కుటుంబానికి రూ.30 లక్షలు సాయం అందిస్తాం" అని సీఎం జగన్‌రెడ్డి భరోసా ఇచ్చారు.




హైదరాబాద్, డిసెంబర్ 6( విభారె) , తెలంగాణ ముఖ్యమంత్రిగా గురువారం రేవంత్ రెడ్డి ప్రమాణం చేయనున్నారు. దీని కోసం విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశంలోని ప్రముఖులకు ఆహ్వానం వెళ్తోంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జగన్ మోహన్ రెడ్డిని అహ్వానించారు. ఆయనతోపాటు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబును పిలిచారు. తెలంగాణ మాజీ సీఎం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కూడా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పిలిచారు. తమిళనాడు సీఎం స్టాలిన్‌కి కూడా ఆహ్వానం అందింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆహ్వానాలు అందాయి. ఎన్నికల్లో సహాయక సహకారాలు అందించిన తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌తోపాటు గాదె ఇన్నయ్య, హరగోపాల్, కంచె ఐలయ్యను ఆహ్వించారు. వివిధ కుల సంఘాల లీడర్లను కూడా ఆహ్వానం పలికారు. ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు సీనియర్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక వాద్రా సహా ఇతర నేతలందర్నీ ఆహ్వానించారు. ప్రత్యేకంగా వారందరితో సమావేశమై తనకు పదవీ బాధ్యతలు అప్పగించనందుకు కృతజ్ఞతలు చెబుతూనే గురవారం జరిగే పదవీ ప్రమాణోత్సవానికి హాజరుకావాలని రిక్వస్ట్ చేశారు. వీళ్లతోపాటు కర్ణాటక సీఎం సిద్దరామయ్యను, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను కార్యక్రమానికి ఇన్వైట్ చేశారు.తెలుగు రాష్ట్రాల్లో వేరే పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవానికి వెళ్లే పరిస్థితి గతం నుంచి లేదు. ఈసారి అలాంటి పరిస్థితి కనిపించనుందా అంటే అనుమానంగా ఉంది.జగన్ ప్రమాణ స్వీకారోత్సవానికితెలంగాణ సీఎం కేసీఆర్ వెళ్లారు. ఇప్పుడు మరి తెలంగాణ సీఎం ప్రమాణానికి ఏపీ సీఎం జగన్ వస్తారా అనేదిఅనుమానంగానేఉంది.మరోవైపురేవంత్ రెడ్డిని ఎన్నుకట్టుగవర్నర్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలియజేశారు. ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ సంతకాలు చేసిన పత్రాన్ని రాజ్‌భవన్‌కు పంపించారు.

## తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి : పురంధ్వేశ్వరి


రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్

అమరావతి,డిసెంబర్6( విభారె) : పంట నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, ఉద్యానవన పంటల సాగుదారులకు వెంటనే ఆర్థిక సహకారం మంజూరు చేయాలని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం ఆమె అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సాగు చేసిన రైతాంగాన్ని కూడా ఆదుకోవాలని కోరారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఆహారాధాన్యాలతో పాటు ఉద్యానవన పంటలతో సహా పలు వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అయితే భీమా చేసిన రైతాంగం ఎంతమంది.. లేనివారు ఎంతమంది అనే గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ డొమైన్‌లో పెట్టక పోవడం వల్ల రైతాంగం ఆందోళన చెందే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్రప్రభుత్వం వెంటనే ఒక ప్రకటన చేయాలని దగ్గుబాటి పురంధరేశ్వరి డిమాండ్ చేశారు.

## ప్రజలంతా ప్రమాణ కార్యక్రమానికి రండి

### ప్రజలకు బహిరంగ పిలుపునిచ్చిన రేవంత్



హైదరాబాద్,డిసెంబర్6 ( విభారె) : కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రజలంతా రావాలని కోరారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల పోరాటం, అమరుల త్యాగం, సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అందరి ఆకాంక్షలు నెరవేర్చే ఇందిమ్మ రాజ్య స్థాపనకు సమయం ఆసన్నమైనదని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, పారదర్శక పాలన అందించేందుకు బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనారిటీ, రైతు, మహిళ, యువత్ సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మీ అందరి ఆశీస్సులతో 2023 డిసెంబర్ 7న, మధ్యాహ్నం 1.04 గంటలకు హైదరాబాద్ ఎల్బీ సేడియంలో ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయబోతోందని రేవంత్ తెలిపారు. ఈ మహోత్సవానికి అందరికీ ఇదే ఆహ్వానం అంటూ రేవంత్ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అధికారులు ఎల్బీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రేపటి సభలో మూడు వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన వేదికపై రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారు. లెఫ్ట్ సైడ్ 63 సీట్లతో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తున్నారు. రైట్ సైడ్ వీవీఐపీల కోసం 150 సీట్లతో వేదిక సిద్ధం చేయనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలు ఉట్టిపడేలా 500 మందితో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాన్నారు. గోండు, డప్పు, ఒగ్గు, బోనాలు, షేరీ బ్యాండ్ కళాకారులతో రేవంత్ రెడ్డికి స్వాగతం పలకనున్నారు.

## ఓటు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాకే నమోదు చేయాలి

### బి ఎల్ ఓ లను ఆదేశించిన జిల్లా కలెక్టర్




ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఓటర్ల వద్ద నుండి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 06 విభారె న్యూస్ :- ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలు సమర్పించిన తరువాతే ఓటర్ల జాబితా లో నమోదు చేయాలని సంబంధిత పత్రాలను దస్రనీ చేసి ఉంచాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ బూతు స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఆళ్లగడ్డ మండల తహసిల్దార్ కార్యాలయంలో ఓట్లకు సంబంధించి ఆర్డిఓ శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ బిఎల్ఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు జాబితాకు సంబంధించి పలు ఆదేశాలు ఇచ్చారు. ఓటర్ల జాబితాలో కొత్తగా నమోదుకు ఫారం 6, తొలగింపుకు ఫారం 7, మార్పులు చేర్పులకు ఫారం 8 దరఖాస్తు లను ఓటర్లనుంచి తీసుకొని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటుకు సంబంధించి అన్ని దృ వపత్రాలు సమర్పించాకే వాటిని అన్నింటిని ఫైల్ చేసి ఓటర్ల జాబితాలో ఓటు నమోదు చేయాలన్నారు. మరణించిన ఓటర్లకు ఎలాంటి ధ్రువపత్రాలు లేని పక్షంలో పంచనామా తీసుకొని ఓటర్ల జాబితాలో నుండి వారి పేరును తొలగించాలన్నారు. ఆన్లైన్లో స్వీకరించిన దరఖాస్తులను, లిఖిత పూర్వకంగా అందిన దరఖాస్తు లను ఎన్నికల నిబంధన మేరకు పూర్తిస్థాయి సమాచారాన్ని ప్రొఫార్మాలో పూరించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరుపై బిఎల్ ఒ లకు, రాజకీయ పార్టీ నాయకులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను నేరుగా ఓటర్ల దగ్గరకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పడకండ్ల గ్రామంలో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే పై పరిశీలన నిర్వహించారు. బడి ఈడు పిల్లలు బయట ఎవరైనా ఉ ంటే బడులలో చేర్పించాలనీ కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆయన నాగిరెడ్డి పల్లె చెంచు కాలనీ సందర్శించారు. కొంతమంది గిరిజనులు తమకు కలెక్టర్ కు మొరపెట్టుకోగా ఆయన హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తో మాట్లాడి గృహాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.


## సహాయక చర్యలు తీసుకోవటంతో జగన్ ప్రభుత్వం విఫలం : దేవినేని ఉమామహేశ్వరరావు



అమరావతి,డిసెంబర్6 (( విభారె) :మిచౌంగ్ తుఫాన్ సహాయక చర్యల్లో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాష్ట్ర ప్రజల ఇబ్బందులు పట్టించుకునే నాధుడే లేదని తెలుగుదేశం నేత, మాజీ మంత్రి దేవినేని ఉ మామహేశ్వరరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. బుధవారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ బాధితులకు వసతి, భోజనం ఏర్పాటు చేయలేని ప్రభుత్వం ఎందుకన్నారు. హుద్ హుద్ లాంటి మహాప్రళయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. హుద్ హుద్, తుపాను వల్ల బాధితులకు నాటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారాన్ని జగన్ సర్కార్ తగ్గించడం దుర్మార్గమన్నారు. కష్టాలలో ఉన్న ప్రజలను పరామర్శించే తీరిక లేని సీఎం జగన్ తా డేపల్లిలో పబ్జి ఆడుకుంటున్నారని దేవినేని ఉమ ఎద్దేవా చేశారు. కాగా విజయవాడ ప్రకాశం బ్యారేజికు భారీగా వరద నీరు చేరింది. 12 అడుగుల గరిష్ఠ నీటి మట్టం దాటి నీరు ప్రవహిస్తోంది. దీంతో అధికారులు పది గేట్లు అడుగు మేర ఎత్తి 5,960 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజికు వరదనీరు చేరుతోంది.

## అహోబిలేసుని సన్నిధిలో ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 06 విభారె న్యూస్ :- ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల నాని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన రాక సందర్భంగా అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువుదిరిన శ్రీ ప్రహ్లాద వరదస్వామి, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే గంగుల నానిని అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మార్కెట్ యార్డ్ మాజీ ఉ పాధ్యక్షుడు గోపవరం నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే గంగులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

# సంపాదకీయం

గురువారం 07-12-2023

## ప్రజాస్వామ్య పునరుద్దరణెళి తొలి విజయం !

తెలంగాణలో ఇప్పుడు ప్రజాస్వామ్య పునరుద్దరణ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అందుకు తగ్గట్లుగానే మన కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రజాస్వామ్య పునరుద్దరణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేయడం ద్వారా..చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడం ద్వారా ఈ ప్రభుత్వం ముందు తన సచ్చీలతను చాటుకోవాలి. ఈనెల 7న సిఎంగా ప్రమాణం చేయబోతున్న రేవంత్ రెడ్డి, మంత్రులుగా ప్రమాణం చేయబోతున్న వారు ముందుగా గ్రామస్థాయిలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కారం చూపగలగాలి. ప్రజలు తాము కోరుకున్న పని చిన్నదే అయినా అది కాకపోతే దానిని పెద్దగా చూస్తారు. దానిని పదిమందికి చెప్పి పెద్దది చేస్తారు. గత పదేళ్లలో అవినీతి బాగా పెరిగింది. గ్రామపంచాయితీ మొదలు అన్ని కార్యాలయాల్లో అవినీతి బాగా వేళ్లూనుకుంది. కాంగ్రెస్ మంత్రులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. వ్యవస్థను బాగు పర్చాలి. గతంలో కెసిఆర్ అనే నియంత..ఆయన కింద ఉన్న ఛోటా నియంతలైన మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డగోలు సంపాదనలతో ప్రజలను పట్టించుకోలేదు. పోలీసులను గుప్పిట్లో పెట్టుకుని కేసులతో బెదరించారు. తమకు వ్యతిరేకులు అనుకున్న వారిని కేసులతో కోర్టుల చుట్టు తిప్పారు. అందులో మన కాబోయే సిఎం రేవంత్ తదితరులు కూడా బాధితులే. ఇప్పుడా సమస్యలు రాకుండా క్షేత్రస్తాయిలో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. గ్రామపంచాయితీ స్థాయిలో చేయి తడపనిదే పని చేయడం లేదు. ఇది అవినీతికి పరాకాష్టగా నిలిచింది. ఈ విషయాలను గతంలో పత్రికల్లో ప్రచారం చేసినా నాటి నియంతలు పట్టించు కోలేదు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తి వల్లనే కాంగ్రెస్ విజయం సాధించింది. నియంతలకు స్థానం లేదని ప్రజలు నిరూపించారు. ఈ అవకాశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగించుకోవాలి. ప్రజలకు మెరుగైన పాలన అందించేలా చేయాలి. గతంలో కన్నా ఇప్పుడు ప్రజలు ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూస్తారు. ఎందుకంటే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. వాటిని మెల్లగా అమలు చేసుకుంటూ పోవాలి. రాజకీయాల్లో పోరాటాలు సహజం. ప్రత్యర్థి పార్టీలను మట్టుపెట్టడం అన్నది ప్రజా స్వామ్యంలో కొత్తేమీ కాదు. కాంగ్రెస్‌ను మట్టి కరిపించిన మోడీ కూడా భారత్ ముక్త కాంగ్రెస్ నినాదంతో ముందుకు సాగుతున్నారు. అయినా కాంగ్రెస్‌ను పూర్తిగా తుడిచిపెట్టలేక పోయారు. తెలంగాణలో బిఆర్ఎస్‌తో అంటకాగి నానాగడ్డి కరిచినందుకు ఆ పార్టీని దెబ్బకొట్టారు. రాజకీయ పార్టీలను చావుదెబ్బ కొట్టడమే లక్ష్యంగా రాజకీయ వ్యూహాలు సాగుతుంటాయి. వాటికి ప్రజల ఆమోదం దక్కితే విజయం సాధిస్తారు. తెలంగాణలో రేవంత్ వ్యూహాలకు ప్రజలు కూడా మద్దతుగా నిలిచారు. కెసిఆర్ అనే అహంభావి ని తరిమికొట్టారు. రేవంత్ ఈ విషయం గుర్తించి తెలివిగా మసలుకుంటే కెసిఆర్ మళ్లీ ఎదగడానికి అవకాశం ఉండదు. అందుకు పాలనాపరమైన శ్రద్ద తీసుకోవాలి. అవినీతిని దూరంగా పెట్టాలి. టిడిపి నుంచి కాంగ్రెస్ లో చేరిన నాటినుంచే రేవంత్ రెడ్డి  కెసిఆర్ కుటుంబ పాలనను అంతమొందిస్తామని ప్రతినబూనారు. అందుకు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని వేదికగా చేసుకుని పోరాటం చేశారు. కెసిఆర్ సాగిస్తున్న వ్యక్తి పాలనను, కుటుంబ పాలనను అంగీకరించడానికి ఇది రాచరిక వ్యవస్థ కాదని ప్రజలు ఇచ్చిన తీర్పుతో రేవంత్ నిరూపించగలిగారు. అలాగని ఎవరైనా ఏకవ్యక్తి పాలన సాగిస్తే అంగీకరించే రోజులు పోయాయి. మధ్య ప్రాచ్య దేశాల్లో కూడా ఏకవ్యక్తి పాలన సాగుతున్న దేశాల్లో దాడులు జరిగాయి. నియంతృత్వ పాలనపై తిరుగబాట్లు జరిగాయి. సద్దాంహుస్సేన్, కల్నల్ గడాఫీ లాంటి వారే మట్టి కరిచారు. ఇంకా చెప్పాలంటే పాక్ సైనిక నియంత పర్వేజ్ ముషారఫ్ కూడా ప్రజల తిరుగుబాటులో తోకముడిచారు. మనదేశంలో ఇందిర నియంతృత్వంపైనా ప్రజలు తిరుగుబాటు చేశారు. బెంగాల్లో వామపక్ష కూటమిని కూకటి వేల్లతో మమతా బెనర్జీ కూల్చి వేశారు. అక్కడ నియంత లేకున్నా నియంతృత్వ పాలన సాగడం కారణంగానే ప్రజలు తిరస్కరించారు. ప్రజలు ఎప్పటికప్పుడు చైతన్యం అవుతూ వస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదరించిన ఎన్టీఆర్‌ను కూడా ప్రజలు తమ ఓటుతో తిరస్కరించారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కేంద్రంలో కాంగ్రెస్ పదేళ్ల పాలనపై ప్రజలు తిరుగుబాటు చేసి మోడీకి పట్టం కట్టారు. అయితే మోడీ కూడా సీనియర్లను పక్కన పెట్టి పార్టీలో ఏకవ్యక్తి పాలన సాగిస్తున్నారు. ఉమ్మడి నిర్ణయాలు తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు సాగుతున్నారు. దేశంలో ప్రజలు ఎప్పటికప్పుడు పాలకుల నిర్ణయాలపై సమీక్షించుకుంటారు. పాలకుల తప్పిదాలను లెక్కలు వేస్తుంటారు. మోడీ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనించడం లేదని అనుకోవడానికి లేదు. కాంగ్రెస్ చేసిన పాపాల కారణంగానే ప్రజలు దానిని దూరంగా ఉంచారు. అలాగని మళ్లీ ఆదరించరని లేదు. అందుకు తెలంగాణెళి ఉదాహరణ. ఇక్కడ కేవలం కెసిఆర్ అహంకారంపై మాత్రమే ప్రజలు తిరుగుబాటు చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కెసిఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్‌కు పట్టం కట్టారు. తెలంగాణ ఏర్పడ్డ సమయంలో, అంతకు ముందూ ప్రజల్లో అనేకానేక ఆకాంక్షలు ఉన్నాయి. అవన్నీ సిఎంగా కెసిఆర్ నెరవేర్చడం పక్న పెడితే..ప్రజలకు దూరంగా, కుటంబానికి దగ్గరగా పాలన సాగించారు. నయా నియంతగా అవతరించారు. తెలంగాణ పోరాట యోధులు,అమరవీరులఆకాంక్షలు నెరవేర్చలేక పోయారు.

# మమ్మల్ని ఆదుకోండి మహాప్రభో...

## డోన్ ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.. సిపిఎం డిమాండ్







విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 6  నిత్యం కరువుతో అల్లాడే ప్రాంతాలనే కరువు మండలాలుగా ప్రకటించకపోవడం ఎంతవరకు సమంజసం ముఖ్యమంత్రి  ఆర్థిక మంత్రి అని సిపిఎం పార్టీ మండల,పట్టణ కార్యదర్శులు కోయిలకొండ నాగరాజు,నక్కి శ్రీకాంత్ ప్రశ్నించారు బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ ఆందోళన ఉద్దేశించి సిపిఎం పార్టీ మండల పట్టణ కార్యదర్శులు కోయిలకొండ నాగరాజు నక్కి శ్రీకాంత్  మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవక వేసిన పంటలు చేతికి అందక ఎకరాకు 50,000 నుంచి 60 వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయాము మమ్ములను ఆదుకోండి మహాప్రభో అంటూ రైతులు ఒకపక్క గోడు వెళ్ళబోస్తా ఉంటే డోను ప్యాపిలి మండలాలలోని రైతాంగాన్ని ఆదుకోవాల్సిన నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నిద్రమత్తులో మునిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో డోను ప్యాపిలి మండలాలు లేకపోవడం ఆర్థిక మంత్రి గారి నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు తెలిపారు కరువు రక్కసితో కడుపు మంటతో ఉన్న డోను ప్యాపిలి మండలలా రైతాంగం ఆర్థిక మంత్రిగారి ఇద్దరు మత్తు వదిలేలా రైతన్నను ఆదుకునే విధంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు చేతి  కాడికి వచ్చిన పంటలు వర్షాలు లేక ఎండిపోతుంటే మండలాలలోని రైతాంగం వారి వారి పిల్లలను కుటుంబాలను బతికించుకోవడానికి బతుకు జీవుడా అంటూ ఇతర రాష్ట్రాలు హైదరాబాదు, బెంగళూరు,చెన్నై,కేరళ లాంటి ప్రాంతాలలో రైతులు రోజువారి కూలీలుగా వారి పిల్లలు తల్లిదండ్రులు బిక్షటన చేసుకుంటూ పొట్ట నింపుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆయన కుటుంబానికి మూడు పూటలా అన్నం పెట్టడానికి ఇతర రాష్ట్రాలలో ఇంత దుర్భర జీవితం గడుపుతున్నాడు అంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి రాయలసీమ ప్రాంత రైతుల మీద ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం అవుతుందని వారు తెలిపారు. ఈ ప్రాంతంలోని చెరువులను నింపామన్న సాకుతో డోను,ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం సరైనది కాదని బటన్ నొక్కిన ముఖ్యమంత్రి  మీరు బటన్ నొక్కి ఎన్ని రోజులైనా చెరువులకు చెంగుడు నీళ్లు చలేదని కాకి లెక్కలతో కడుపు నింపుకునే ఈ ప్రభుత్వానికి తెలియజేయడం ఏమంటే మీరు చూపిన చెరువుల లిస్టులో ఒకటో ఆరో ఒక మాదిరి రైతాంగానికి ఉపయోగపడే చెరువులు ఉన్నాయి కానీ ఎక్కువ శాతం చిన్నపిల్లవాడు మూత్రం పోస్తే చెరువులు ఉన్నాయని అవి కూడా చెరువులేనా అని వారు ప్రశ్నించారు ఈ ప్రాంత రైతాంగాన్ని ఇంత పెద్ద ఎత్తున మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి ఈ ప్రాంత ఈ ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు రైతాంగం తగిన గుణపాఠం చెబుతారని మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్పందించి తక్షణమే డోను ప్యాపిలి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం మంజూరు చేయాలని,కరువు సహాయక చర్యలు ప్రారంభించి రైతాంగాని ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు లేనియెడల రాబోవు రోజుల్లో ఈ ప్రాంత రైతాంగాన్ని సమీకరించి సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తామని అవసరమైతే అన్ని రాజకీయ పార్టీలను ప్రజాసంఘాలను ఐక్యం చేసి జాతీయ రహదారి దిర్బంధం కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని వారు హెచ్చరించారు సిపిఎం నాయకులు ఎస్ఏ చిన్న రహిమాన్, రామాంజనేయులు, భాస్కర్ రెడ్డి నాగమద్దయ్య, నక్కి హరి, షమీం బేగం,అమృత, అశోక్,మాదేవి, మహబూబ్ బాషా, రత్న జయమ్మ,సుధాకర్,అక్బర్ బాషా,విజయుడు,రాజశేఖర్,వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ 67 వర్ధంతి సందర్భంగా...



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 6  భారతీయ జనతా పార్టీ డోన్ ఆధ్వర్యంలోభరణి రమేష్  ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మరియు చంద్రశేఖర్  ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67 వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పిచడం జరిగింది. ఈ కార్యక్రంలో  రాజశేఖర్ పట్టణ అధ్యక్షులు,రవికుమార్  మండల్ల అధ్యక్షులు ,నారాయణ స్వామి ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షులు , మద్దిలేటీ,వడ్డే మహారాజ ,రాఘ వేంద్ర ఆచారి,పోలా వెంకటేశ్వర్లు, వినోద్ కుమార్, సుంకన్న మార్ప్ష ,హుసైన్ ఆర్ పి ఐ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 67వ, వర్ధంతి వేడుకలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 06- భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా  21 వార్డు సచివాలయం యందు మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి మాజీ కౌన్సిలర్అనిల్ అమృత రాజ్ ఆయన విగ్రహానికి  పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అసమానతల నిర్మూలనకు జీవితాంతం పోరాటం చేసి అన్ని వర్గాలకు సమ న్యాయం జరగాలన్న దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన, అంబేద్కర్ జీవితం ఆచరణీయమని కొనియాడారు. ఆదిపత్య ధోరణులకు, వివక్షకు తావివ్వకుండా ప్రజలందరూ స్వేచ్ఛ గా జీవించాలని ఆయన కోరుకున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## హోంగార్డ్లు నైపుణ్యతను పెంచుకోవాలి


### నంద్యాల జిల్లా ఎస్పీ .కె.రఘువీర్ రెడ్డి



-విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 06 -బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయం నందు 61వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ .కె .రఘువీర్ రెడ్డి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి గారు మాట్లాడుతూ "పోలీస్ శాఖలో ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా నిశ్వార్థంగా సేవ చేస్తున్న మీకు నా జోహార్లు" అని తెలియజేశారు. పోలీసు సిబ్బందితో పోలిస్తే హోంగార్డులకు ఎన్ని సౌకర్యాలు తక్కువ ఉన్నా కూడా కొన్ని సందర్భాల్లో వారి కంటే ఎక్కువ సేవ చేస్తున్నారని . ఈ విషయంలో నంద్యాల జిల్లా పోలీస్ శాఖ తరపున హోంగార్డులకు అభినందనలు  తెలిపారు. హోంగార్డ్స్ నంద్యాల జిల్లా 496 హోం గార్డ్స్ మంది శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, క్రైమ్ నియంత్రణ, లా అండ్ ఆర్డర్స్ డ్యూటీ,  డ్రైవర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల యందు, దేవాలయాల యందు భద్రత కొరకు మరియు టెక్నికల్ కెటగిరీల యందు పనిచేయుచున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత ఉండడం వల్ల వారితో సమానంగా హోంగార్డులు విధులను కూడా నిర్వహిస్తున్నారని అన్నారు.

## బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

### రవి చంద్రా రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 06-బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి అనే నినాదంతో ముందుకు వెళ్తున్న ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి ఎవరైతే డ్రాప్అవుట్స్ పిల్లలు ఉన్నారో ఆ పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకున్నట్లు అందుకు అనుగుణంగా వారికి కావలసినటువంటి పౌష్టికాహారమైతేనేమి వారు చదువుకునే పుస్తకాలు అయితేనేమి చదువుకోడానికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా కూడా ప్రభుత్వం అందజేస్తుందని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రా రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం లో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ  ప్రతి పిల్లవాడు బడికి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని దేశంలో అక్షరాస్యత శాతం 100 శాతం ఏపీలో ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తుందని కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. అందుకు అనుగుణంగానే కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి వెళ్లి  పిల్లలను బడిలో చేర్పించే బాధ్యత తీసుకున్నామని అందుకు అనుగుణంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని కమిషనర్ రవి చంద్రా రెడ్డి తెలిపారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించిన  టిడిపి కార్యకర్తలు



గోనెగండ్ల డిసెంబర్ 06 విభారె న్యూస్ ప్రతినిధి భారత రాజ్యాంగ నిర్మాత, బాబా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా బి ఆర్ అంబేద్కర్ గారి 67వ వర్ధంతి సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు గౌశ్రీడాబివి జయ నాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు స్థానిక గోనెగండ్ల టిడిపి పార్టీ కార్యాలయంలోడాబి ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పూలవూల సమర్పించిఘనంగానివాళులర్పిస్తున్న గోనెగండ్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు..

## అసైన్మెంట్ పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వై బాలనాగ రెడ్డి





పెద్దకడూరు డిసెంబర్ 06 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలం హులికనివి బాపలోదొడ్డి గవిగట్టు చిన్నతుంళం ముచ్చుగిరి నవులేకళు గ్రామలలో సంబంధించి భూ పంపిణీ కార్యక్రమం అసైన్మెంట్ భూములు పట్టాలు అధ్యక్షతన మండల నాయకులు పురుషోత్తం రెడ్డి రామ్మోహన్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో పంపిణీ చేయడం జరిగినది పంపిణీ కార్యక్రమం నందు పట్టాల పొందిన లబ్ధిదారులు పెద్దకడబూరు మండలం తాసిల్దారు సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు

## బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను పాటిద్దాం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 06 బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బొమ్మల సత్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా, జిల్లా రెవెన్యూ అధికారి బి .పుల్లయ్య తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శాసనమండలి సభ్యులు ఇసాక్ భాష మాట్లాడుతూ భారత రాజ్యాంగ ప్రదాత, మనకందరికీ స్ఫూర్తి దాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఘనంగా నివాళులు అర్పించాలన్నారు. అంబేద్కర్ ప్రవేశపెట్టిన రాజ్యాంగం వల్ల దేశంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుభిక్షంగా ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఎన్నో అవమానాలు, ఇబ్బందులు, కష్టాలను ఎదుర్కొని పేదరికం నుండి వచ్చిన అంబేద్కర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం కావాలన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగానే మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎస్సీ, బిసి ,ఎస్టీ మైనారిటీలకు ప్రాతినిధ్యం వహిస్తూ అందరినీ ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉంచాలని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య మాట్లాడుతూ బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆశయాలను కొనసాగించడానికి మనమందరం పునరంకితం కావాలని ఆయన కోరారు.

# పోలీసు-శాఖలో హోంగార్డుల విధులు, సేవలు ప్రశంసనీయం

**కర్నూలు జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్. హోంగార్డ్ కమాండెంట్ సదరన్ రీజియన్ యం.మహేష్ కుమార్.**





- విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి డిసెంబర్ 06 – సమాజసేవలో, శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డులు సేవలు పోలీసులతో సమానం.హోంగార్డు రైజింగ్ డే సంధర్బంగా మంచి మార్కులు సాధించిన హోంగార్డుల పిల్లలకు, విధులలో , క్రీడల పోటీలలో గెలుపొందిన హోంగార్డు సిబ్బంది విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన ... జిల్లా ఎస్పీ. పోలీసుల సంక్షేమమే ముఖ్యము అని అందరూ బాగా పని చేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ గారు అన్నారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాల్ లో 61 వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ శ్రీ జి. కృష్ణకాంత్ ఐపియస్ గారు మాట్లాడుతూ ....పోలీసులతో సమానంగా హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణలో విధులు, సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు.అందరి సహాయ సహాకారాలతో ఒక టీమ్ వర్క్ గా పని చేస్తేనే మంచి పేరు వస్తుందన్నారు. దేవరగట్టు బన్ని ఉత్సవం, పండగలు, ఆదోని, కర్నూలు వినాయచవితిలలో మంచిగా విధులు నిర్వహించారన్నారు. వచ్చే ఎన్నికల విధులలో అందరూ బాగా పని చేయాలన్నారు.జిల్లా ఎస్పీ గా నా పరిధిలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తానన్నారు. సమస్యలుంటే జిల్లా ఎస్పీ వాట్సప్ నెంబర్ కు పంపించాలన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. పారదర్శకంగా, నిజాయితీగా పని చేయాలన్నారు. క్రమ శిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్టను పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. హోంగార్డ్ కమాండెంట్ సదరన్ రీజియన్ యం.మహేష్ కుమార్ గారు మాట్లాడుతూ...1963 సంవత్సరంలో ఆవిర్భవించిన హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందన్నారు. ఇతర డిపార్ట్ మెంట్ లలో కూడా హోంగార్డులు మంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు...ఏ కారణంగా మరణించిన కేంద్రప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వ ఫథకాలైనా ఖఓ సురక్ష భీమా యోజన, ఖఓ జీవన జ్యోతి భీమా యోజన క్రింద 2 లక్షల భీమా పరిహారం లభిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు యాక్సిస్ బ్యాంకు నుండి రూ. 30 లక్షలు ఇస్తుందన్నారు.దహన సంస్కారాల కు 10 వేలు, ఫ్లాగ్ ఫండ్ 10 వేలు, మెడికల్ క్లైయిమ్ రూ. 10 వేలను జిల్లా మరియు హోంగార్డ్సు వేల్ఫేర్ ఫండ్ నుండి అందిస్తున్నామన్నారు. 2018 నుండి మృతి చెందిన హోంగార్డ్సు కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్ధిక సహాయం అందజేస్తున్నామన్నారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్, ఎం .టెక్ లలో మంచి మార్కులు సాధించిన 34 మంది హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్స్ కింద మొత్తం రూ. 88 వేల నగదు రివార్డులు అందజేశారు. స్పోర్ట్స్ లో గెలుపొందిన హోంగార్డు సిబ్బంది కి విజేతలకు జిల్లా ఎస్పీ గారు బహుమతులు ప్రధానం చేశారు. విధులలో ప్రతిభ కనబరచిన 20 మంది హోంగార్డులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కారుణ్య నియమాకం ...1)హోంగార్డు 337 రాజశేఖర్, జూన్ 2022 లో మృతి చెందారు. ఈయన భార్య వై. మల్లేశ్వరి కి హోంగార్డు ఉద్యోగ నియమాక పత్రం అందజేశారు. 2)హోంగార్డు 518 మల్లికార్జున , సెప్టెంబర్ 2023 లో మృతి చెందారు. ఈయన భార్య టి. హేమలత కి హోంగార్డు ఉద్యోగ నియమాక పత్రం అందజేశారు. హోంగార్డు కాంట్రిబ్యూషన్ ఫండ్ , ఫ్లాగ్ ఫండ్...1)హోంగార్డు 518 మల్లికార్జున భార్య టి. హేమలత కి హోంగార్డు కాంట్రిబ్యూషన్ ఫండ్ రూ. 2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ రూ. 10 వేలు అందజేశారు. 2) హోంగార్డు 212 వెంకటేశ్వర్లు భార్య దేవి కి హోంగార్డు కాంట్రిబ్యూషన్ ఫండ్ రూ. 2 లక్షలు, ఫ్లాగ్ ఫండ్ 10 వేలు అందజేశారు.పదవి విరమణ...హోంగార్డు 87 మహబూబ్ సుభాహాని పదవివిరమణ పొందారు. జిల్లా ఎస్పీ గారు శాలువ, పూల మాలతో సన్మానించారు. హోంగార్డులందరూ కలిసి స్వచ్ఛంధగా జీతాల నుండి పోగు చేసి సేకరించిన రూ. 2 లక్షలు జిల్లా ఎస్పీ గారు చేతుల మీదుగా అందజేశారు. హోంగార్డు ఆర్. శ్యాముల్, హోంగార్డు చంద్రపాల్ లు పాటలు, పద్యాలు పాడి అందరిని అలరించారు. జిల్లా ఎస్పీ గారు వారిని అభినందించి రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఐపియస్ గారు, హోంగార్డ్ కమాండెంట్ సదరన్ రీజియన్ యం.మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి .సర్కార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి. నాగబాబు, హోంగార్డ్ డిఎస్పీ కృష్ణమోహన్, ఆర్ ఐ లు రమణ, రవికుమార్, పోతలరాజు, శివారెడ్డి, ఆర్ ఎస్సైలు , పోలీస్, హోంగార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు

# భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ 67 వర్ధంతి



విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి డిసెంబర్ 06 – భారత రాజ్యాంగ నిర్మాత మన బాబా సాహెబ్ అంబేద్కర్ గారని కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్ విల్సన్ గారు అభిప్రాయపడ్డారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి 67వ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. జాన్ విల్సన్ గారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు మెచ్చుకునే విధంగా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రపంచ దేశాల రాజ్యాంగాలను చదివి భారత రాజ్యాంగాన్ని నిర్మించి, దళిత గిరిజన బడుగు బలహీన వర్గాల తలరాతలు మార్చారని విల్సన్ గారు తెలియజేశారు. అనంతరం పిసిసి ఉపాధ్యక్షులు ఎం సుధాకర్ బాబు గారు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల నుంచి వచ్చి అత్యున్నత విద్యను అభ్యసించి భారత రాజ్యాంగాన్ని రచించి బడుగు బలహీన వర్గాలకు సమాజంలో స్థానం కల్పించిన గొప్ప వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారని కొనియాడారు. అనంతరం పిసిసి అధికార ప్రతినిధి ఏ కరుణాకర్ బాబు గారు మాట్లాడుతూ అంబేద్కర్ గారు న్యాయవాద, ఆర్థిక, రాజకీయ, సంఘ సంస్కర్తగా, అంటరానితనం నిర్మూలనకు పాటు పడ్డారని మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ గారు మాట్లాడుతూ ప్రపంచ మేధావులలో అగ్రగన్యుడని భారతదేశ పునర్నిర్మాణ దృష్టితో రాజ్యాంగాన్ని రూపొందించిన అస్తమించని మేధా సూర్యుడని బిఆర్ అంబేద్కర్ గారిని కొనియాడారు. ముందుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ గారి చిత్రపటమునకు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక పాత బస్టాండు నందలి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి కాంస్య విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు ఎం సుధాకర్ బాబు, పిసిసి అధికార ప్రతినిధి ఏ కరుణాకర్ బాబు పిసిసి ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పోతుల శేఖర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎస్ ప్రమీల సిటీ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్ డిసిసి సెక్రెటరీ రియాజ్ ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు కాంగ్రెస్ నాయకులు ఉండవెల్లి వెంకటన్న యన్ సి బజారన్న, బి చంద్రశేఖర్ కాద్రిపాషా వెంకటస్వామి అభి నాయుడు బి సుబ్రహ్మణ్యం శివానంద్ రాజేంద్రప్రసాద్ వసిబాష, కృష్ణారెడ్డి నడిపి గుండాలు మహిళా కాంగ్రెస్ కరుణమ్మ, లలిత, సాయి భార్గవి, హైమావతి మొదలగు వారు పాల్గొన్నారు.

# రెండో వారం నుంచి వారాహి యాత్ర



గుంటూరు, డిసెంబర్ 6, ,)పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5వ విడత వారాహి యాత్ర ఎప్పుడు. సార్వత్రిక ఎన్నికలు సమయం దగ్గర పడటంతో వారాహి యాత్రకు పవన్ కళ్యాణ్ బ్రేక్ ఇచ్చారా. పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్ర తాత్సారం వెనుక ఉన్న కారణాలు ఏంటి. లోకేష్ యువగళం కొనసాగుతున్న వేళ పవన్ యాత్రకు బ్రేక్ ఇచ్చారా.. పవన్ వారాహి యాత్ర 5.0 ఎప్పుడు.. ఎక్కడ నుంచి ప్రారంభం కానుంది. అనే అనేక ప్రశ్నలు సామాన్యుల్లోనే కాదు పవన్ అభిమానుల్లోనూ నెలకొంది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారాహి యాత్ర ఐదో విడత ప్రారంభం ఎప్పుడన్న అంశంపై జనసేన పార్టీలో పెద్ద ఎత్తున నడుస్తోంది. ఇప్పటికే వారాహి యాత్ర పేరుతో ఉభయ గోదావరి, ఉత్తరాంధ్రల్లో పర్యటించిన పవన్ కళ్యాణ్.. కృష్ణా జిల్లాలో నాల్గవ విడతతో ప్రస్తుతానికి బ్రేక్ ఇచ్చారు. వారాహి యాత్ర మొదటి విడత అన్నవరంలో ప్రారంభం కాగా నాలుగు విడతల్లో మొత్తం 37 రోజుల్లో 22 నియోజకవర్గాలలో పర్యటించారు. అయితే మొదటి నాలుగు విడతల్లో సక్సెస్ అయిన వారాహి యాత్రను 5విడత కూడా చేపట్టేందుకు పవన్ కళ్యాణ్ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే పవన్ చేపట్టబోయే 5వ విడత యాత్ర ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా ప్రారంభం అవుతుందన్న దానిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ఒకవైపు సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతూ ఉండటం మరోవైపు టిడిపితో పొత్తుపై పవన్ కళ్యాణ్ క్షేత్ర స్థాయిలోకి వెళ్ళేలా అడుగులు వేస్తుండటం, సమన్వయ కమిటీల పేరుతో జిల్లాల వారీగా తెలుగుదేశం పార్టీతో కలిసి పోరాటాలు చేస్తున్న వేళ తాజాగా ఐదో విడత చేపట్టే యాత్రపై పెద్ద ఎత్తున రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వైఫల్యాలపై వారాహి యాత్ర పేరుతో పవన్ కళ్యాణ్ ప్రజలకు దగ్గర అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్న వేళ పార్టీకి మంచి మైలేజ్ వచ్చిందని భావిస్తున్నారు పార్టీ నాయకులు. అందులో భాగంగా నాలుగు విడతల్లో ముగిసిన దాని కంటే భిన్నంగా.. మరింత ధీటుగా 5వ విడత యాత్రతో ప్రజల్లోకి వెళ్ళేలా ప్రణాళికలు రచిస్తున్నారు పవన్. ఇప్పటికే టిడిపితో పొత్తుపై ప్రకటన చేసిన తర్వాత జరిగిన నాలుగో విడత యాత్రలో అటు తెలుగుదేశం నేతలు సైతం భారీ ఎత్తున పాల్గొన్నారు. అయితే ప్రస్తుతం నెలకొన్నరాజకీయ పరిణామాల్లో చంద్రబాబు జైలు నుంచి బెయిల్ పై బయటకు వచ్చారు. మరోవైపు నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి పవన్ వారాహి యాత్ర చేపట్టడం రెండు పార్టీలకు మరింత బలం చేకూరుతుందని జనసేన పార్టీ నేతలు భావిస్తున్నారు.ఇదిలా ఉంటే మొదట నాలుగు విడతల్లో పవన్ కళ్యాణ్ చేపట్టిన యాత్ర సక్సెస్ అవడంతో ఇప్పుడు మిగతా నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టారు. నాలుగు విడతల్లో పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల వారిగా యాత్ర చేపట్టిన జనసేనాని ఇప్పుడు మిగతా నియోజకవర్గాల్లో చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే అటు ఉత్తరాంధ్ర లేదా ఇటు రాయలసీమ నుంచి యాత్రను చేపట్టాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో ఉభయ గోదావరి,ఉత్తరాంధ్ర ,కృష్ణా జిల్లాలో పలు నియోజవర్గ పరిధిలో యాత్ర ముగియగా త్వరలో రాయలసీమ నుంచి చేపట్టేలా పవన్ కళ్యాణ్ ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి రాయలసీమ పరిధిలో పలు నియోకవర్గాల్లో పార్టీకి ఆశించిన స్థాయిలో మైలేజ్ లేదు. అయితే జనవానితో పాటు కౌలు రైతులను ఆదుకోవడం కోసం చేపట్టిన కార్యక్రమాలకు మంచి మైలేజ్ రావడంతో ఇప్పుడు వారాహి యాత్ర రాయలసీమ జిల్లాల నుంచి చేపట్టేలాగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.మొన్నటి వరకు వారాహి యాత్ర రాయలసీమ జిల్లాల పరిధిలో చేపడతారా లేదా అనే దానిపై కన్ఫ్యూజన్ నెలకొంది. అయితే అనూహ్యంగా టీడీపీతో పొత్తుపై పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్న తరువాత టీడీపీతో పాటు జనసేన క్యాడర్ రెండు కలిసి వచ్చే అంశాలుగా పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. ఇప్పటికే పొత్తుపై పవన్ కళ్యాణ్ ప్రకటన తరువాత అవనిగడ్డ , పెడన, కైకలూరు, మచిలీపట్నం పరిధిలో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రస్తుతం రాయలసీమ జిల్లాల్లో వైసీపీకి మంచి పట్టు ఉంది. అందుకే టీడీపీ బలహీనంగా ఉన్న జిల్లాల పరిధిలో పవన్ కల్యాణ్ యాత్ర చేపడితే పార్టీకి మంచి మైలేజ్ వస్తుందని పవన్ కళ్యాణ్ బావిస్తున్నారు. అందులో భాగంగా 5విడత చేపట్టే యాత్ర రాయలసీమ జిల్లాల పరిధిలో ప్రారంభించి గ్రాండ్ సక్సెస్ చేసి సీఎం ఇలాకాలో తమ సత్తా నిరూపించుకోవాలని భావిస్తున్నారు.రాయలసీమ జిల్లాల పరిధిలో యాత్ర చేపట్టడం ద్వారా ఇప్పుడే అభ్యర్థులను బరిలో దింపితే అక్కడ పట్టు సాధించడానికి అవకాశం ఉందని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. టీడీపీతో పొత్తుపై ఒక స్పష్టత ఇచ్చిన నేపథ్యంలో రాజంపేట ,కడప, రైల్వే కోడూరుతో పాటు అనంతపురం, కర్నూలు జిల్లాలో యాత్రను ప్లాన్ చేస్తున్నారు పవన్ కళ్యాణ్. సీమ జిల్లాల పరిధిలో వలసలు, వ్యవసాయం, వెనుకబాటు అంశాల్ని ప్రస్తావిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అందులో భాగంగానే రైతులను ఆదుకోవడానికి చేపట్టిన యాత్రతో పాటు, జనవాణి కార్యక్రమం కొన్ని ప్రాంతాల్లో విజయవంతం అవడంతో.. టిడిపికి పట్టున్న ప్రాంతాల పరిధిలో అభ్యర్థులు భరీలో ఉండేలా అడుగులు వేస్తూ ఈ యాత్రను ప్రారంభిస్తారు. ఒకవైపు లోకేష్ యువగలం పాదయాత్ర ఉభయ గోదావరి జిల్లాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తరాంధ్రకు లోకేష్ చేరుకునే లోపు పవన్ కల్యాణ్ రాయలసీమ వైపు వారాహి యాత్ర ముగించాలని భావిస్తున్నారు.ఇక రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి సీట్లు.. పోటీ చేసే అంశంలోనూ ఒక క్లారిటీ వస్తుందని అంటున్నారు ఆ పార్టీ నేతలు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ నాలుగు విడతల్లో ఉభయ గోదావరి, ఉత్తరాంధ్ర, కృష్ణా జిల్లాలో యాత్ర చేపట్టిన నేపథ్యంలో రాయలసీమ జిల్లాల నుంచి చేపడిటే అటు లోకేష్, ఇటు పవన్ కల్యాణ్ చేపట్టిన రెండు యాత్రలతో ప్రజల్లోకి వెళ్ళడానికి సరైన సమయం అని ఇరు పార్టీల నేతలు అనుకుంటున్నారు. అయితే ఇప్పుడు నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పవన్ కల్యాణ్ సైతం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

## ఘనంగా 67వ, వర్ధంతి వేడుకలు




పెద్దకడబూరు డిసెంబర్ 06 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రమైన పెద్దకడబూరులో ఆయన విగ్రహానికి ఫోరం ఫర్ ఆర్టిఐ జిల్లా కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఫోరమ్ ఫర్ ఆర్.టి.ఐ. జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న మాట్లాడుతూ సామాజిక అసమానతల నిర్మూలనకు జీవితాంతం పోరాటం చేసి అన్ని వర్గాలకు సమ న్యాయం జరగాలన్న దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన, అంబేద్కర్ జీవితం ఆచరణీయమని కొనియాడారు. ఆదిపత్య ధోరణులకు, వివక్షకు తావివ్వకుండా ప్రజలందరూ స్వేచ్ఛ గా జీవించాలని ఆయన కోరుకున్నారని, ఆయన తెలిపారునేటికి స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు దాటిపోయిన భారత దేశంలో ఉండబడే అధిక సంఖ్యాక ప్రజలైన బీసీ ఎస్టీ ఎస్సీ మైనార్టీ ప్రజలను రాజకీయంగా ఎదగకుండా తక్కువ శాతంగా ఉండబడే అగ్రవర్ణులు అడ్డుకోవడం జరుగుతుందని బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారా తప్ప రాజ్యాధికారానికి రానివ్వడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ ప్రజలు మేల్కొని రాజ్యాధికారంగా దిశగా వైపుగా అడుగులు వేసి నప్పుడే అంబేద్కర్ కలలుగన్న సమసమాజం సిద్ధిస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పోరం ఫర్ ఆర్కే జిల్లా కమిటీ సభ్యులు ఏ జంపన్న తెలుగు యువత నాయకులు కేవి దుబ్బన్న యువ నాయకులు ఎం ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## జంగమ జన జాగృతి మహా సభను జయప్రదం చేయండి..

కోసిగి,డిసెంబర్ 06 (విభారె న్యూస్)ఈనెల10 తేదీన ఆదోని లోని శ్రీ కోట వీరభద్ర స్వామి దేవస్థానం నందు జరుగు జంగమ జన జాగృతి మహా సభను జయప్రదం చేయాలని ఆదోని డివిజన్ జంగమ సంక్షేమ సంఘాలు మరియు అనుబంధ సంఘాలు సంయుక్తంగా పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా జంగం సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ ఆదివారం శ్రీ భద్ర కాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం నందు జంగమ జన జాగృతి మహాసభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అలాగే ఉదయం వీరభద్ర స్వామికి కి పంచామృత అభిషేకం మరియు శ్రీ ముద్దు మల్లికార్జున స్వామి వారికి సహస్ర బిల్వార్చన మరియు మహా మంగళ హారతి జంగమ గురువులచే ధర్మసభ జరునని తెలిపారు. అదేవిధంగా ప్రముఖ జంగమ మహేశ్వర్ల ప్రసంగం, అంతర్ రాష్ట్రీయ కళాకారుడు మయూరి బసవరాజు చే కూచిపూడి నాట్యం ,మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. అలాగే జానపద గేయాలు, ఇంగ్లీష్ జానపద నృత్యం, భరతనాట్యం కూచిపూడి నాట్యం ఆదోని భీమన్న గారి నుండి మిమిక్రీ కార్యక్రమాలు జరుగును. కావున జిల్లా జంగమ మహేశ్వరులందరూ సకుటుంబ సమేతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని సభను విజయవంతం చేయాల్సింది వారు కోరారు.

## అంబేద్కర్ సేవలు చిరస్మరణీయం..

కోసిగి,డిసెంబర్ 06(విభారె న్యూస్) రాజ్యాంగ సృష్టికర్త, భారతరత్న శ్రీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్రీ పి మురళీ మోహన్ రెడ్డి కొనియాడారు. ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం కోసిగి మండల పరిషత్ కార్యాలయం నందు యంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా మురళీ మోహన్ రెడ్డి పాల్గొని, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, సామాజిక అసమానతలను నిర్మూలనకు పోరాడి, అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలన్న దృక్పథంతో రాజ్యాంగంను రచించడం జరిగిందని, ఆయన జీవితం అచరణీమని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులుయన్‌నరసింహులు, బసిరెడ్డి, ఏఓ మాధవరెడ్డి, ఆయాగ్రామాలనాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారి 67వ వర్ధింతి సంతాప సభ





పెద్దకడబూరు డిసెంబర్ 06: ( విభారె న్యూస్పెద్దకడబూరు మండలం యస్సీ కాలనీ సచివాలయం -2 నందు జరిగింది ఈ కార్యక్రమంలో యం ఆర్ పి యస్ పెద్దకడబూర్ మండల అధ్యక్షుడు యంపి. యువరాజ్ మాదిగ మరియు జే. సతీష్ మాదిగలు మాట్లాడుతూ"6-డిఇసి -1956 భారత్ లోని బహుజనులు ఒంటరి వార యిన రోజు. దుఃఖసాగరంలో మునిగిన రోజు. బాబా సాహెబ్ "మహా పరి నిర్వాణం" చెందిన రోజు. భారతదేశ చరిత్రలో ఈ పదం కేవలం రెండుసార్లు మాత్రమే ప్రయోగించారు మహోన్నుతులలో మహోన్నుతు లకు, యుగపురుషులకు మాత్రమే ఈ పదం ఉపయోగించడం జరిగింది. మహా మానవుడు బుద్ధుని పరి నిర్వాణాన్ని" మహా పరి నిర్వాణం"గా ప్రకటించడం జరిగింది బుద్ధుని తర్వాత భారతదేశ చరిత్రలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పరి నిర్వాణాన్ని "మహా పరి నిర్వాణం"గా ప్రకటించడం జరిగింది. బుద్ధుని తర్వాత వివిధ దేశాల్లోని ఎందరో బుద్ధిష్ట్ ల పరి నిర్వాణాన్ని మహా పరి నిర్వాణం గా ప్రకటించలేదు. బాబా సాహెబ్ మహా మానవుడు విశ్వ రత్న భారతరత్న జ్ఞానానికి ప్రతీక, త్యాగానికి ప్రతీక, రక్షకుడు! బాబా సాహెబ్ అనుయాయులను కొంటున్న మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది .ఆయన జీవితం పోరాటం మనకు స్ఫూర్తి దాయకం. ఆయన రచనలు మనకు ఆదర్శం. ఆయన రచనలు చదవకుండా ,ఆయన చూపిన మార్గంలో నడవకుండా, పక్కదారి పట్టి నాము ,భవిష్యత్తు అగమ్య గోచరంగా ఉంది .ఇకనైనా తప్పులు తెలుసుకుని మన కొరకు ,భావి తరాల కొరకు, అంబేద్కర్, ఆలోచనా విధానం చుక్కానిగా మన ప్రయాణాన్ని కొనసాగించాలి .అప్పుడు మాత్రమే మన గమ్యాన్ని చేరుకోగలం. బానిసత్వం నుండి విముక్తికై బుద్ధిష్ట్ జీవన విధానంలోకి రావాలి. బాబా సాహెబ్ ఇచ్చిన 22 ప్రతిజ్ఞలు ఆచరించాలి .మారిన మనుషులుగా బాబా సాహెబ్ సంతతిగా గర్వంగా జీవించాలి.! ఈ కార్యక్రమంలో యం ఆర్ పియస్ కార్యకర్తలు జాగతప్పగారి ముక్కరన్నా మాదిగ, బొగ్గుల అర్లప్ప మాదిగ, బొగ్గుల బర్నాబాసు మాదిగ, మేకలబొగ్గుల రాజుమాదిగ, బొగ్గులరాజు మాదిగ, ముఖ్య అతిధిగా ఎపిఓ రామన్న సార్ పాల్గొన్నారు

## సమ్మెతో నైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి...సీఐటీయూ

### డిసెంబర్ 8 నుండి అంగన్వాడి సెంటర్లు బంద్

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 6 అంగన్వాడీల సమస్యలపై గత నాలుగున్నర సంవత్సరాల పాటు అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఈ నెల 8వ తేదీ నుండి జరిగే నిరవధిక సమ్మెతో నైనా కళ్ళు తెరవాలని సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి. షేబారాణి, నాయకులు సులోచన, సిఐటియు పట్టణ కార్యదర్శి టి. శివరాం, మండల అధ్యక్షుడు పి. రామాంజనేయులు, కోశాధికారి బి. నాగమద్దయ్య, పిఎన్ఆర్ జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు, సిఐటియు నాయకులు చిన్న రహిమాన్, నాగన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో జరిగిన అంగన్వాడీల ప్రాజెక్టు సమావేశంలో వారు మాట్లాడారు. ఈ మేరకు ప్రభుత్వం కళ్ళు తెరిపించాలని కోరుతూ స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, సున్నా నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు అనేక సేవలు అందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుకనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని. నిరంతరం నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజల్, గ్యాస్, ఆర్టీసీ, రైల్వే ధరలు పెరుగుతూ ఉన్నాయని, వేతనాలు మాత్రం పెరగడం లేదని. అంగన్వాడీ వర్కర్లు మినీ వర్కర్లు, హెల్పర్లు ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనాలతో జీవనం గడపడం కష్టంగా ఉందని. అంతే కాకుండా అంగన్వాడి సెంటర్ల నిర్వహణకు సంబంధించిన బిల్లులన్నీ సకాలంలో చెల్లించక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. తెలంగాణా కంటే రూ. 1000/-లు ఎక్కువ వేతనం ఇస్తానని చెప్పిన ముఖ్యమంత్రి



హామి నెరవేరలేదని, 2022 లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకి గ్రాట్యూటీ అమలు చెయ్యాలని తీర్పునిచ్చిందని మన రాష్ట్రంలో గ్రాట్యూటీ అమలు చెయ్యటం లేదన్నారు. గత 46 సం?ల నుండి పనిచేస్తున్న అంగన్వాడీలు కనీసం సర్వీసులో ఉండి చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వటం లేదని. ప్రభుత్వం అందరికీ అమలు చేస్తున్న సంక్షేమ పధకాలు కూడా అంగన్వాడీలకి అమలు చెయ్యటం లేదన్నారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు వివిధ రకాల యాప్ లు తెచ్చారని. ఫోన్లు సక్రమంగా పని చెయ్యటం లేదని, ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నెట్ సిగ్నల్ ఉండటం లేదని. దీని వలన అంగన్వాడీలు మానసిక వత్తిళ్లకు గురి అవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో అంగన్వాడీలు దశలవారీగా అనేక ఆందోళనలు చేసినా అధికారులతో చర్చలు జరిపినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో క్రింది డిమాండ్స్ పరిష్కారం కోసం డిశంబర్ 8 నుండి సెంటర్లని మూసివేసి నిరవధికంగా సమ్మె చేయాలని అన్ని కార్మిక సంఘాలు నిర్ణయించాయి అన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుమలత, రహమద్ బి, నాగలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మీదేవి, గుల్జార్, శ్రీలత, లక్ష్మీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి...

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:- డిసెంబర్ 6 అంగన్వాడీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంగన్వాడి వర్కర్స్ కు హెల్పర్స్ కు తెలంగాణ వాళ్ళ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనాలు చెల్లిస్తానని చెప్పి ఐదు సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు వారికి వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటీ కల్పించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మినీ సెంటర్స్ ను మెయిన్ సెంటర్స్ గా మార్చి మెయిన్ టీచర్స్ తో సమానంగా వేతనాలు ఇచ్చి మినీ సెంటర్ టీచర్స్ ని కూడా ప్రమోషన్స్ కల్పించాలని వారు కోరారు. హెల్పర్స్ కు ప్రమోషన్ వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచి రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని వారు కోరారు. ఫేస్ యాప్ ను రద్దుచేసి అన్ని యాప్ లను కలిపి ఒకే యాప్ గా మార్చాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికుల సమస్యలను




పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుండి 20వ తేదీ వరకు వివిధ దశల్లో ఉద్యమాలను చేపడుతున్నామని ఈ ఉద్యమాల్లో అంగన్వాడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కులు సాధించేంతవరకు పోరాటాలు కొనసాగించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి డోన్ నియోజకవర్గం కార్యదర్శి అబ్బాస్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్తేరు, చాందిని ,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు మంగమ్మ, నిర్మల ,విజయ రత్నమ్మ, జయలక్ష్మి శ్రీదేవి సరళ పుష్ప మల్లిక పుష్పలత, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసే నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆళ్లగడ్డ ప్రతినిధి డిసెంబర్ 06 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన తాలూకా నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి వేడుకలు ఇరిగేల బ్రదర్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగేల బ్రదర్స్ విశ్వనాథ రెడ్డి, ఇరిగెల ప్రతాప్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జనసేన తాలూకా సమన్వయకర్త మైలేరి మల్లయ్య, ఆళ్లగడ్డ తాలూకా జనసేన ఎస్సీ సెల్ నాయకులు డాలు రత్నమయ్య, సిరివెళ్ల మండల జనసేన నాయకులు పసుల నరేంద్ర, గౌస్ బాష, తేజ, షేక్ మహబూబ్ బాషా, జ్ఞాన సుందరం, రమణ, చంద్రబాబు, షరీఫ్ తదితరులు బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాత్రి అనక పగలనక నిద్రాహారాలు మాని ప్రజల కోసం రాజ్యాంగాన్ని రచించారని, ఆయన కన్నీటితో రాసిన అక్షరాలే ఈ దేశ ప్రజల తలరాత అయిందని అన్నారు. ఆయన చనిపోయిన రాజ్యాంగం రూపంలో నిత్యం బ్రతికి ఉన్నారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లి రాజ్యాధికారాన్ని సాధించాలని పిలుపునిచ్చారు..

## 512 జీవోను వెంటనే రద్దు చేయాలి...




విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- డిసెంబర్ 6 డోన్ పట్టణం లోని బార్ అసోసియేషన్ అడ్వకేట్ లు 512 టైటిలింగ్ యాక్ట్ కు వ్యతిరేకంగా కోర్టు దగ్గర నుంచి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం దగ్గరకు ర్యాలీగా వెళ్లడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ 512 టైటిలింగ్ యాక్ట్ వల్ల భూ తగదాలు జరుగుతే ప్రజలు కోర్టుకు వెళ్లే హక్కు లేని విధంగా ఈ యాక్టును సీఎం జగన్మోహన్ రెడ్డి విడుదలచేయడమనేది పేద ప్రజలకు శాపమన్నారు. వెంటనే ఈ 512 యాక్ట్ ను రద్దు చేయాలని నినాదాలు చేశారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల 8123 మందికి లబ్ధి

### షేక్ షహనాజ్ 24 వార్డు కౌన్సిలర్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి డిసెంబర్ 06- ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు 8123 మందికి 24వార్డు ప్రజలకు లబ్ధి చేకూరాయని 24 వార్డు కౌన్సిలర్ షేక్ షహనాజ్ పేర్కొన్నారు . బుధవారం 24 వార్డు యందు కౌన్సిలర్ షేక్ షహనాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన( వై ఏపీ నీడ్సుజగన్) కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్. వార్డు కౌన్సిలర్ షేక్ షహనాజ్ హాజరయ్యారు .ముందుగా నచివాలయ కన్వీనర్లుగృహ సారథులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డు సచివాలయంకు చేరుకొని డిబిటి - నాన్ డిబిటి ద్వారా అందిస్తున్న నవరత్నాల పథకాల అమలు సంబంధించిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న పాలనా వ్యత్యాసంను వివరిస్తూ మళ్ళీ ఆంధ్రప్రదేశ్ కు జగన్ ఎందుకు కావాలంటే అనే విషయాన్ని వివరించారు. 24 వార్డు యందు వివిధ రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల 8123 మంది లబ్ధిదారులకు . 21.కోట్ల 83 లక్షలు17వేలు లబ్ధి చేకూరుతుందని అన్నారు . . ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు. సచివాలయ అడ్మిన్ సౌజన్య. నోడల్ అధికారి వాణిశ్రీ . వైసీపీ నాయకులు షేక్ రహముతుల్లా , సచివాలయకన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190